
క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు



పిడుగురాళ్ల: రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ నెలలో ఉపవాస దీక్షను ఎంతో పవిత్రంగా, ఐదు పూటలా నమాజ్ చదివి, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంతోషమన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జెట్టిపాలెం(రెంటచింతల): జెట్టిపాలెం ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశానికి ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కె. పాపయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్షలో పొందిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారన్నారు. విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాలుగేళ్ల మినహాయింపు ఉంటుందన్నారు. ఏప్రిల్ 20న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు స్థానిక పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాల సెల్ నంబర్ 91829 58496కు సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గురజాల : ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. మాచవరం మండలం చెన్నాయపాలెం గ్రామానికి చెందిన పోలే జాన్ కోటేశ్వరరావు, కాటేపల్లి వేణు ద్విచక్ర వాహనంపై చెన్నాయపాలెం నుంచి రెంటచింతలకు వెళ్లారు.. మార్గం మధ్యలో గురజాల హైవే దండివాగు సమీపంలో డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం నరసరావుపేటకు రిఫర్ చేసారు.

స్పందించని 108 సిబ్బంది..

క్షతగాత్రులను గమనించి పక్కనే ఉన్న జగనన్న కాలనీ వాసులు 108కి ఫోన్ చేశారు. 40 నిమిషాలకు తర్వాత కూడా 108 అంబులెన్స్ రాకపోవడంతో అటుగా వెళ్తున్న ఆటోలో..క్షతగాత్రులను సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



బొల్లాపల్లి : నీటి సమస్య ఉన్న గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేస్తున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ ఎం.ఆకాష్‌నాయక్ తెలిపారు. గత నెలలో నీటి సరఫరా విభాగం ఉన్నతాధికారులు, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఆయా శాఖల సిబ్బంది మండలంలో నీటి సమస్య ఉన్న గ్రామాలను పర్యటించి నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి అంచనా వేసినట్లు వివరించారు. వారి ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో గత పది రోజుల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. గండిగనుమల సచివాలయం పరిధిలోని గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నామన్నారు. గండిగనుమలలో 6, దోమలగుండం 3, తండా 3, షోలాయపాలెం 3 ట్యాంకర్ల ద్వారా ప్రస్తుతం నీటి సరఫరా అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో నీటి కొరత తీరుస్తున్నామని, ఉన్నతాధికారులు తదుపరి ఆదేశాలతో పూర్తిస్థాయి నిధులు సర్దుబాటు కాగానే త్వరలోనే ట్యాంకర్ల సంఖ్యను పెంచి మరిన్ని ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా జరుగుతుందని ఏఈ తెలిపారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: రైల్వేస్టేషన్ సమీపంలోని రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమంలో ఆదివారం వాసవీ క్లబ్ అన్నపూర్ణ ఇస్సప్పాలెం ఆధ్వర్యంలో వృద్ధులకు 12 రకాల ఆర్గానిక్ పండ్లు పంపిణీ చేశారు. వేసవి కాలం దృష్ట్యా ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు బొప్పాయి, పుచ్చకాయ, కిస్మిస్, ద్రాక్ష, ఖర్జూరం వంటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ ఉపాధ్యక్షుడు కనమర్లపూడి శ్రీనివాసరావు, క్లబ్ పట్టణ అధ్యక్ష్య, కార్యదర్శులు పొట్టి వెంకటేశ్వరరావు, అనిల్, మునగాల శ్రీనివాసరావు, వెల్లంపల్లి కేశవరావు, చేగు వెంకటేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధి పూనూరి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

రొంపిచర్ల: మాచవరం గ్రామంలో ఆదివారం కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం విరిగిపోయి తీగలపై ఆధారపడి ఉంది. ఆ సమయంలో ట్రాక్టర్ ట్రాలీలో 30 మంది వరకు కూలీలు ఉన్నారు. విద్యుత్ వైర్లు తెగిపోకపోవటంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. విద్యుత్ సరఫరా కూడా స్తంభించింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు రంగంలోకి దిగి సరఫరాను పునరుద్ధరించారు.

అవినీతి ధార



మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ పంచాయతీ పరిధిలోని మంచినీటి కొళాయి కనెక్షన్లలో అవినీతి ధార పారుతోంది. అక్రమ కొళాయి కనెక్షన్లతో 'పన్ను' వసూలు దారి తప్పతోంది. పంచాయతీలో ఉన్న నివాసాలకు.. లెక్కల్లో చూపుతున్న కొళాయి కనెక్షన్లకు పొంతన ఉండటం లేదు. తమ చేతిని తడిపిన వారికి..అధికారులు అక్రమ కొళాయి కనెక్షన్లు ఇచ్చి, వాటిని లెక్కల్లో చూపడం లేదు. దీంతో పంచాయతీ ఆదాయానికి గండిపడటంతో పాటు.. నీటిని సరఫరా చేసే మోటార్లను పర్యవేక్షణ లేక ఇష్టం వచ్చినట్లు వాడటంతో విద్యుత్ బకాయి తడిసిమోపెడవుతోంది.

- రెంటచింత పంచాయతీలో అక్రమ కొళాయి కనెక్షన్లు
- నగదు తీసుకుని రికార్డుల్లో నమోదు చేయని అధికారులు
- భారీగా కొళాయి నీటి పన్ను కోల్పోతున్న పంచాయతీ
- సక్రమ కొళాయి కనెక్షన్లు 1000..
- అక్రమ కనెక్షన్లు 500 పైమాటే..
- మోటార్ల నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యం..
- రూ.3 కోట్ల మేర పేరుకుపోయిన విద్యుత్ బాకాయి



రెంటచింతల గ్రామ పంచాయతీ కార్యాలయం

రెంటచింతల: రెంటచింత పంచాయతీలో సుమారు 4,350 నివాసాలకు సుమారు 24 వేల మంది జనాభా ఉంది. ఇప్పటికీ కేవలం వెయ్యి నుంచి 1,050 వరకు మాత్రమే కొళాయి కనెక్షన్లు మాత్రమే ఇచ్చినట్లు.. గ్రామ పంచాయతీ రికార్డు ప్రకారం నమోదైంది. తక్కువ కొళాయి కనెక్షన్లకు ఒకరిద్దరు కింద స్థాయి సిబ్బందితో పాటు ఓ అధికారి చేతివాటం కారణంగా తెలుస్తోంది. గ్రామస్తుల నుంచి కనెక్షన్‌కు రూ.3,625 వసూలు చేసి, రికార్డులో కనెక్షన్ లబ్ధిదారుని పేరు నమోదు చేయని ఘటనలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ అధికారి పర్యవేక్షణ లేకపోవడంతో సుమారు 500కు పైగా అక్రమ మంచినీటి కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఏటా గ్రామ పంచాయతీ ఒక కనెక్షన్‌కు రూ.600 పన్ను వసూలు చేస్తోంది.

అక్రమ కనెక్షన్లను క్రమబద్ధీకరించండి..

పన్ను చెల్లిస్తున్న గ్రామస్తులకు అక్రమ కనెక్షన్లు మింగుడు పడడం లేదు. తమ వద్ద పన్ను వసూలు చేస్తూ.. అక్రమ కనెక్షన్లదారులను చూసి చూడనట్లు వదిలేయడాన్ని వారు సహించలేకున్నారు. అక్రమ కనెక్షన్లను ఎందుకు క్రమబద్ధీకరించరు అంటూ పన్ను వసూలు చేయడానికి వచ్చే గ్రామ పంచాయతీ సిబ్బందిని నిలదీస్తున్నారు. కొన్ని ఇళ్లల్లో రెండే అక్రమ కనెక్షన్లు కూడా ఉన్నాయి.

పంచాయతీకి విద్యుత్ బాకాయి షాక్..

రెంటచింత పంచాయతీ నెలకు రూ.లక్ష వరకు విద్యుత్ బిల్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే సుమారు రూ.3 కోట్లకు పైగా బకాయి పేరుకుపోయింది. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో మోటర్ కనెక్షన్‌లు పెద్దవి 10, చిన్నవి మరో 32 వరకు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఆయా ప్రాంత ప్రజలకు మంచి నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ మోటర్లపై పంచాయతీ పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరిష్టం వచ్చినట్లు వారు మోటార్లు వేసుకుని, నీరు వృథా చేస్తున్నారు. దీంతో పాటు విద్యుత్ బిల్లు కూడా పంచాయతీకి తడిసి మోపెడవుతోంది. గ్రామంలో ఇప్పటికైన అక్రమ మంచినీటి నీటి కొళాయి కనెక్షన్లపై దృష్టిపెట్టి, వాటిని తొలగించి, పంచాయతీకి ఆదాయం పెంచడానికి అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతి కొళాయి కనెక్షన్‌కి పన్ను వసూలు చేయాలి



గ్రామంలో కొలాయి కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరి నుంచి గ్రామ పంచాయితీ వారు నీటి పన్ను ఖచ్చితంగా వసూలు చేయాలి. పన్ను వసూలు చేయడం వలన నీటి వాడకం పట్ల బాధ్యతగా ఉంటారు. గ్రామంలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన మంచినీటి మోటర్లపై కూడ పంచాయితీ వారు పర్యవేక్షణ ఉండాలి. దీంతో నీటి వృధా కాకుండా ఉంటుంది. విద్యుత్ వాడకం తగ్గుతుంది.

– ఏరువ ప్రతాప్‌రెడ్డి, రెంటచింతల

అక్రమ కనెక్షన్లపై చర్యలు తీసుకోవాలి



అక్రమ కొళాయి కనెక్షన్లపై పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. కొందరు సిబ్బంది చేతివాటం చూపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వారిని విధుల నుంచి తొలగించాలి. కనెక్షన్‌కు నగదు చెల్లించిన వారి పేరును రికార్డులో నమోదు చేయాలి. కనెక్షన్ కలిగిన ప్రతి ఒక్కరి నుంచి మంచి నీటి పన్ను వసూలు చేయాలి.

– నారాయణపురం శ్రీనివాస్, రెంటచింతల

ఎలాంటి చర్యల్లేవు



అక్రమంగా మంచి నీటి కొళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసుకున్న వారిపై ఇప్పటి వరకు ఏలాంటి చర్యలు తీసుకోలేదు. చేతివాటం చూపించే సిబ్బందికి ఎంతో కొంత ముట్టచెప్పి అక్రమంగా కనెక్షన్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. పంచాయతీకి చట్టబద్ధంగా కనెక్షన్‌కు రూ.3,625 చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలి. గ్రామ పంచాయతీ అధికారి నిర్లక్ష్యం ఈ పరిస్థితికి కారణం.

– గంజి ఇన్నారెడ్డి, రెంటచింతల

కల్యాణం..కమనీయం

గురజాల రూరల్: మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో వేంచేసియున్న అలివేలు మంగా, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, మండపంపై స్వామి వారిని ఉంచి వేద పండితులు మంత్రోచ్చరణలతో కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నప్రసాద వితరణ చేశారు.

హాస్పిటల్ ప్రారంభం



పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీ సౌజన్య హాస్పిటల్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ శాఖ వైద్యులు ఆదివారం ప్రారంభించారు. పల్నాడు హాస్పిటల్ అధినేత, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌తో పాటు ఐఎంఏ పిడుగురాళ్ల శాఖ అధ్యక్షులు దూళ్లిపాళ్ల భరత్‌కుమార్, సభ్యులు పాల్గొని పలు బ్లాక్‌లను ప్రారంభించారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే



పిడుగురాళ్ల: ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ పెడితే ఉన్నత శిఖరాలకు అధిరోహించవచ్చునని హెచ్ఎం రామలింగయ్య పేర్కొన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ ఆదివారం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


తాళ్లపల్లి గ్రామంలో శివను పరామర్శిస్తున్న పిన్నెల్లి

మాచర్ల రూరల్: వైఎస్సార్ సీపీ వెంట మొదట నుంచి కష్టనష్టాలలో ఉంటున్న ప్రతి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని, ఎవరూ అధైర్యపడవద్దని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివ, అనారోగ్యానికి గురైన భద్రయ్య కుటుంబాలను ఆయన పరామర్శించి మాట్లాడారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షుడు పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, సర్పంచ్ యంగ్రగాలయ్య, పార్టీ నాయకులు బూడిద సైదులు, జూకూరి వెంకట్రామయ్య, శివయ్య, ఎంపీటీసీ పి.మల్లయ్య, పుట్టా బ్రహ్మయ్య, పాపయ్య, కొప్పుల రామ్మూర్తి, ఉల్లి నారాయణ, పరమేశ్వరరావు, దేరంగుల గురవయ్య, శ్రీనివాసరావు, ఏడుకొండలు, ప్రసాద్ ఉన్నారు.

శాంతి స్థాపనకు అల్లా తోడు ఉంటాడు


పెద్ద మసీదు వద్ద ముస్లిం మత పెద్దలు

పిడుగురాళ్ల: శాంతి స్థాపనకు అల్లా తోడు ఉంటాడని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ మేస్త్రీ తెలిపారు. పట్టణంలోని పెద్ద మసీదు వద్ద(మర్కస్ మసీదు వద్ద) రంజాన్ నెల ప్రారంభం కావటంతో ముస్లిం సోదరులు అందరు రంజాన్ మాస ఉపవాస దీక్షలు ప్రారంభించారు. మధ్యాహ్నం పెద్ద మసీదు వద్ద అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ మేస్త్రీ ఆధ్వర్యంలో పెద్ద మసీదు హిమామ్ దువా చేస్తూ దేశ సమగ్రతకు, శాంతి స్థాపనకు, రాష్ట్రాభివృద్ధికి, ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని, అల్లా ఆ విధంగా తోడ్పడాలని ఆకాంక్షించారు. మసీదు వద్ద ముస్లిం సోదరులు రంజాన్ ప్రారంభానికి నెల వంక కనిపించడంతో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ సెక్రటరీ షేక్ మస్తాన్‌వలి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్, షేక్ అబ్దుల్ ఖాదర్, కమిటీ సభ్యులు షేక్ గౌస్‌బాబుసాహెబ్, ఫరీద్ మేస్త్రీ, జానిబాబు, అబ్దుల్ కరీం, మున్నీర్, జిల్లానీ, భాషా, లతీఫ్, ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతే పరిశ్రమకు ముఖ్యం


చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద మారథాన్

దాచేపల్లి : పెద గార్లపాడు గ్రామ సమీపంలోని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ఆదివారం మారథాన్ నిర్వహించారు. జాతీయ భద్రత వారోత్సవాల సందర్భంగా కార్మికులు, గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. భద్రతతో కూడిన పని పరిశ్రమ అభివృద్ధికి దోహద పడుతుందని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ హెడ్ సీహెచ్.సీతారామయ్య అన్నారు. భద్రత చర్యలు తీసుకున్న తరువాతనే కార్మికులు పని ప్రారంభించాలని, భద్రత లేకుండా పనులు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. కార్మికుల భద్రతకు యజమాన్యం అన్ని రకాల చర్యలు చేపట్టిందని, కార్మికుల భద్రతే పరిశ్రమకి ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ హెడ్ బీవీఆర్.రాజు, సెఫ్టీ హెడ్ వెంకటమూర్తి పాల్గొన్నారు.

4న ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల


ప్రసన్నాంజనేయస్వామి ఆలయం

ఈపూరు (శావల్యాపురం) : బొగ్గరం గ్రామంలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల ఈనెల 4న గ్రామస్తులు నిర్వహించనున్నారు. ఏటా శివరాత్రి పర్వదినం అనంతరం వచ్చే ఫాల్గుణ శుద్ధ పంచమి నాడు ఈతి రునాళ్ళ నిర్వహించటం ఆనవాయితీ. ఆలయ ప్రాంగణంలో సంతానవేణుగోపాల స్వామి ఆలయం ఉంది. ఇక్కడ ప్రదక్షిణలు చేస్తే సంతానం సిద్ధిస్తుందని భక్తుల నమ్మిక. తిరునాళ్లకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. తిరునాళ్ల కోసం ఇప్పటికే ఆలయ పరిసరాల్లో దుకాణాలు వెలుస్తున్నాయి. నరసరావుపేట డీఎస్పీ పర్యవేక్షణలో వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు సారథ్యంలో ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరావు బందోబస్తు నిర్వహించనున్నారు.

320 మంది రోగులకు వైద్య పరీక్షలు



దాచేపల్లి : స్థానిక వీర్ల అంకమ్మతల్లి దేవాలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. నారాయణపురంలోని పార్థు హస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్లు సాయికర్ణకుమార్, రాజరాజేశ్వరి, మండలి మహేష్, శివ, హుస్సేన్‌షా వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ రోగాలతో పాటుగా చిన్న పిల్లలు, స్త్రీలు, ప్రసూతి, నరాలు, బీపీ, షుగర్, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహణ పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గురజాల : స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో జిల్లా అంధుల ఉద్యోగ సంఘం ఉపాధ్యక్షుడు కోలా కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.శంకర్, బండి రవికుమార్, అమృతం ఆంజనేయులు, దేగల ఏసుదానం, షేక్ ఫకీర్ పాల్గొన్నారు.

అమీన్‌సాహెబ్ పాలెం ప్రభకు గ్రామోత్సవం



నాదెండ్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లి తిరిగి గ్రామానికి చేరుకున్న అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ ప్రభకు శనివారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపు ఆదివారం తెల్లవారుజాము వరకు జరిగింది. ఇదిలా ఉంటే ఈ నెల 3న సోమవారం అప్పాపురం గ్రామ ప్రభకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

చిన్నమ్మ టీచర్ అంకితభావం ఆదర్శం


చిన్నమ్మ టీచర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు

రెంటచింతల: ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చిన్నమ్మ టీచర్ అంకితభావం ఉపాధ్యాయులకు ఆదర్శమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో ఉద్యోగ విరమణ చేసిన చిన్నమ్మ టీచర్‌కు సన్మాన సభ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నమ్మ టీచర్ సైకాలజీలో పీహెచ్‌డీ చేసి, తన ప్రత్యేకతను చాటుకున్నారని కొనియాడారు. రాష్ట్ర, జిల్లా మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్‌గా చిన్నమ్మ టీచర్ అమూల్యమైన సేవలు అందచేశారన్నారు. చిన్నమ్మ టీచర్ సేవలను ప్రభుత్వం గుర్తించి, భారత మహిళ శిరోమణి అవార్డుతో, ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఘనంగా సత్కరించిందన్నారు. అనంతరం టీచర్‌ను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ–2 వై. శివనాగేశ్వరరావు, విచారణ గురువులు రె. ఫాదర్ వైఎల్ మర్రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రేమ్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, విశ్రాంతి ఎంఈఓలు వి. నాగయ్య, ఈ. శ్రీనివాస్, జి. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఓ. సాగర్‌బాబు, సీహెచ్ నాసరయ్య, వి.వి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వేసవిలో లోతు దుక్కులే శ్రేష్టం


ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న రైతు

అమరావతి: భూమిని లోతుగా దున్నుకుంటే వర్షపు నీరు లోపలికి బాగా ఇంకి, పైర్ల వేర్లు భూమిలోకి చొచ్చుకుపోయి ఎక్కువ పోషకాలను గ్రహించే అవకాశం ఉందని మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తేలిక నేలల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండడం వల్ల తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండదన్నారు. అందుకని పశువులు, జీవాల ఎరువు, పంటల వ్యర్థాలు వంటివి వాడటం వల్ల భూమి గుల్లబారి తేమ, పోషక పదార్థాలను పట్టి ఉంచే శక్తి పెరుగుతుందన్నారు. వేసవి దుక్కి తరువాత నీటి వసతి ఉన్న ప్రాంతాలలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే భూసారం పెరుగుతుందని తెలిపారు. భూములలో వాలుకు అడ్డంగా దున్నటం వల్ల కోతను నివారించటమే కాక భూమి భౌతిక లక్షణాలు మెరుగుపడతాయన్నారు. లోతు దుక్కుల వల్ల కలుపు మొక్కలు వేర్లతో సహా పెకిలించబడి మట్టితో కలిసిపోతాయని అన్నారు. వేసవి దుక్కుల వలన శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు, ఎర్రగొంగళి పురుగు, వేరు పురుగు వంటి వాటిని చాలా వరకు తగ్గించవచ్చన్నారు. లోతుగా దున్నినప్పుడు పై భాగాన ఏర్పడిన గట్టి పొరలు విడిపోయి నేల గుల్లబారి గాలిశాతం పెరగటం వల్ల సూక్ష్మజీవుల సంఖ్య వృద్ధి చెంది సేంద్రియ పదార్థం త్వరగా కుళ్లటానికి తోడ్పడతాయన్నారు.

త్వరలో వినుకొండలో మహాయాగం

వినుకొండ: లోక కల్యాణార్థం వినుకొండలో చేపట్టిన మహాయాగాన్ని జయప్రదం చేయాలని హిమాలయ గురువు పిలుపునిచ్చారు. మండలంలోని విఠంరాజుపల్లి సాయి బృందావనం ఆవరణలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హిమాలయ గురువు మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకొని సాయి బృందావనంలో నిర్వహించిన మహాశివరాత్రి కార్యక్రమాలను దిగ్విజయం చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వేడుకల ఖర్చులు, పూర్తి లెక్కలను సమావేశంలో వెల్లడించారు. ప్రపంచ శాంతిని కోరుతూ లోక కల్యాణార్థం 12 సంవత్సరాల పాటు నిర్వహించ తలపెట్టిన మహాయాగం కార్యక్రమాన్ని జయప్రదం చేసే దిశగా అందరి సహాయసహకారాలు కావాలని, ఇప్పటికే అన్ని రంగాల వారితో చర్చలు జరుపుతున్నామని, చర్చల అనంతరం మరోసారి సమావేశం నిర్వహించి యాగం పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు. అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివశక్తి ఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణ, శాంతి ఆశ్రమ ట్రస్ట్ నిర్వాహకులు పెండేల వెంకట మోహన్‌రావు, కె.అనంతకోటేశ్వరరావు, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, పెండేల పుల్లారావు, మునిరెడ్డి పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత వీరంగం

సత్తెనపల్లి: గంజాయి మత్తులో యువత వీరంగం సృష్టించగా ఒకరికి గాయాలైన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శనివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నాగర్జుననగర్ 6వ వార్డుకు చెందిన తమ్మిశెట్టి ఆంజనేయులు అలియాస్ అంజయ్య వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం సాయంత్రం సుమారు 5–6 గంటల సమయంలో దగ్గరలో ఉన్న దుకాణంలో కిరాణా సరుకులు తీసుకొని తిరిగి వస్తూ ఉండగా స్థానిక యువకులు మద్యం, గంజాయి మత్తులో అంజయ్య వద్ద ఉన్న డబ్బులు ఇవ్వమని అడగగా అతను తిరస్కరించాడు. దీంతో ముగ్గురు యువకులు వారి వద్ద ఉన్న కత్తులతో అంజయ్యపై దాడి చేశారు. బాధితుడిని స్థానికులు హుటాహుటిన సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు.

4న మేడిచెరువు బహిరంగ వేలం

శావల్యాపురం: చినకంచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మేడి చెరువులో చేపలు పెంపకానికి ఈ నెల 4న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి చక్రవరపు శ్రీవల్లీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎల్‌పీఓ, గ్రామస్తుల సమక్షంలో వేలంపాట జరుగుతుందని వెల్లడించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ, మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com